
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 2 । డిసెంబర్ । 2023



1283 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 29.734 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1282 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,770
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,817
3శాతం జీఎస్టీతో	రూ.5,992
నవర (8గ్రా)	రూ.47,936

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /22.6

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 83 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా వాతావరణం పొడిగా ఉంది. శనివారం జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

76.41 శాతం పింఛన్ల పంపిణీ



అనారోగ్యంతో నెల్లూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సుబ్బరాజుకు పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్ రమ్యముత్యం

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. శుక్రవారం 76.41 మంది లబ్ధిదారులకు కానుక నగదు అందజేశారు. 3,15,544 మంది లబ్ధిదారులకు నగదు అందజేయవలసి ఉండగా 2,41,100 మందికి పంపిణీ చేశారు. వలంటీర్లు ఉదయం నుంచే వైఎస్సార్ కానుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. అవ్వాతాతలు ఇబ్బందులు పడకుండా వారు ఉండే ప్రాంతాలకు వెళ్లి నగదు అందజేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ పరిశీలనాధికారిగా భాస్కర్

నెల్లూరు (దర్గామిట్ట): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 ప్రక్రియ పరిశీలన నిమిత్తం కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్‌ను ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తారని, ఎంపీ, ఎంఎల్‌ఏ, ఎంఎల్‌సీ, గుర్తింపు పొందిన జాతీయ, రాజకీయ పార్టీల నాయకులతో మధ్యాహ్నం ఒంటి గంటకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

భారీ వర్ష సూచన అప్రమత్తంగా ఉండండి

నెల్లూరు (దర్గామిట్ట): బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం కారణంగా 3, 4, 5 తేదీలలో జిల్లాలో ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ పేర్కొన్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలు, మత్స్యకారులు చేపల వేటకు సంబంధించి వాతావరణ కేంద్రం ద్వారా సమయానుకూలంగా వచ్చే బులెటిన్‌లను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని 1077/0861–2331261 కాల్ సెంటర్‌కు గాని, మీ దగ్గర్లోని సచివాలయంలో సమాచారమివ్వాలని ఆయన కోరారు.

సెక్టార్ ఆఫీసర్లు పోలీసుల పాత్ర కీలకం

- ఎన్నికల విధులపై శిక్షణలో కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రక్రియలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో 2024లో జరగనున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు అధికారులకు ఎన్నికల విధులపై ముందస్తుగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని వారికి కేటాయించిన ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఏదైనా కారణం వల్ల ఇబ్బందులు ఉండి ఓటు హక్కు వినియోగించుకోలేకపోయే ఓటర్ల ప్రాంతాలను, సెగ్మెంట్‌లను, గ్రామాలను గుర్తించి ఆ ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా సంబంధిత సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు అధికారులు వల్నేరబుల్ మ్యాపింగ్ ప్రక్రియను కచ్చితంగా, పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను సెక్టార్ పోలీసు అధికారులు పరిశీలన చేసి వివరాలతో నివేదిక అందించాలన్నారు. తొలుత తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి ఎన్నికల ప్రక్రియపై, పోలింగ్‌కు ముందు, పోలింగ్ సందర్భంలో పోలింగ్ తరువాత చేయాల్సిన విధుల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు మాలోల, శీనానాయక్, మధులత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్‌కుమార్, ఓబులేసు పాల్గొన్నారు.





జ్యోతి వెలిగించి లక్ష దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న విశాఖపట్నం శ్రీసౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతి స్వామి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, లక్షదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దీపం ప్రణమామ్యహం

- వైభవంగా కార్తీకమాస లక్ష దీపోత్సవం
- పూజాదికాలతో ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న సింహపురీయులు
- నేడు, రేపు కూడా కార్యక్రమాలు



మహాశివునికి భస్మాభిషేకం దృశ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ మైదానం కార్తీకమాస లక్ష దీపోత్సవంతో సప్తవర్ణ శోభితంగా తేజోరిల్లింది. వరుణుడు కరుణించడం ... వాతావరణం అనుకూలించడంతో భక్తజనం వెలిగించిన కార్తీక దీపాల కాంతుల్లో శివకేశవులు కొలువైన పవిత్ర ప్రాంగణం దీపకాంతుల్లో ప్రజ్వరిల్లింది. హరిహరాదులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నగరంలోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్, కార్తీకమాస లక్షదీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్తీక మాస లక్షదీపోత్సవం తొలిరోజు అంగరంగ వైభవంగా, విశేషపూజల నడుమ ఘనంగా ప్రారంభమైంది. లక్ష దీపోత్సవాన్ని విశాఖపట్నం శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం అధిపతి పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ రామానందభారతి స్వామి చేతుల మీదుగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులు కార్తీక దీపాలను వెలిగించి హరిహరాదులకు ప్రణమిల్లారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతోపాటు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి శ్రీవైద్యనాథ్, శ్రీకృష్ణ స్వామివారికి అభిషేకాలు, పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. అశేష భక్తజన సందోహం నడుమ మహాశివునికి వివిధ ద్రవ్యాలతో భస్మాభిషేకం, ప్రత్యేక హారతులు నిర్వహించారు. తదుపరి



భక్తులకు సందేశమిస్తున్న రామానంద భారతి స్వామి

భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది.

అఖండ దీపారాధనతో జీవితంలో వెలుగులు – రామానందభారతి స్వామి

శివకేశవులను మనోవాచకాలతో వేడుకుంటూ చేసే కార్తీకమాస దీపారాధనతో జీవితం వెలుగులమయమౌతుందని, మహాదేవుని నామస్మరణతో సర్వపాపహరణం జరిగి జీవితం తేజోమయమౌతుందని విశాఖపట్నం శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం అధిపతి పరమహంస పరివ్రాజకాచార్య రామానందభారతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. సత్యం పలికే వారిని పరమేశ్వరుడు ఎల్లప్పుడు అనుగ్రహిస్తారన్నారు. అందుకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు చేపట్టిన కార్తీకమాస లక్ష దీపోత్సవమే సాక్షాత్కారమన్నారు. సింహపురి కార్తీకమాస లక్ష దీపోత్సవానికి వేదిక కావడంతో నెల్లూరీయుల జన్మసుకృతమైందన్నారు.



లక్ష దీపోత్సవంలో పూజా కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

సంప్రదాయ దుస్తులతో...

మూడు రోజులు జరిగే కార్తీక మాస లక్ష దీపోత్సవం శుక్రవారం ఉదయం శాస్త్రోక్త పూజాది కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైంది. సకల జనుల సంక్షేమాన్ని కాంక్షించి ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లే జార్ఖండ్ రాష్ట్రం దేవ్‌ఘర్‌లోని శ్రీవైద్యనాథ్ మహాశివుని శివలింగ ప్రతిష్ఠ, ఉడుపి శ్రీకృష్ణభగవాన్ విగ్రహ తాత్కాలిక ప్రతిష్ఠ కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. లక్ష దీపోత్సవం సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు సంప్రదాయ దుస్తులతో తొలిరోజు వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గోపూజ, వృషభ పూజలను నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, శ్రీవైద్యనాథ్ మహాశివుని శివలింగ ప్రతిష్ఠ, ఉడుపి శ్రీకృష్ణభగవాన్ విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన పూజ, మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. హరిహరాదుల ఆశీస్సులతో గత ఎనిమిది సంవత్సరాలుగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో కార్తీకమాస లక్ష దీపోత్సవాలను నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఒక్కొక్క ఏడాది ఒక్కో విశేషంతో దీపోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఒక ఏడాది కేదార్‌నాథ్ ఆలయ నమూనాను ఏర్పాటుచేసి ఉత్సవాలు నిర్వహించామన్నారు. ఈ ఏడాది శ్రీవైద్యనాథ్ ఆలయ నమూనా, ఉడిపి శ్రీకృష్ణ భగవాన్ ఆలయ నమూనాలను తీర్చిదిద్దామన్నారు. మూడు రోజులు లక్ష దీపాలు వెలిగించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కరశర్మ, ఆమంచర్ల వెంకట ప్రభాకర్, గంధం సునీల్ కుమార్, ఆశం విజయసారథి పాల్గొన్నారు.

నేడు, రేపూ ఓటర్ల నమోదు

నెల్లూరు (దర్గామిట్ట): ఈ నెల 2, 3 తేదీలలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం రెండు రోజుల పాటు చేపడుతున్నామని అన్నారు. ఈ రెండు రోజులు సంబంధిత బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ బూత్‌లో ప్రజలకు అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి 6, 7, 8 ఫారాలను అందించడంతో పాటు పూర్తి చేసిన ఫారాలను కూడా స్వీకరిస్తామన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు 5వ తేదీ వరకు పొడిగింపు

నెల్లూరు (టౌన్): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 10వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో 12వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో 14వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో వర్షాలు కురుస్తున్నందున కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సిబ్బంది కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తారని తెలిపారు. కంట్రోల్ రూం 24 గంటల పాటు పనిచేస్తుందని అన్నారు. 2వ తేదీ పీ మోహనరూప (డే) నం.7799604010లో, అరుణ్ తేజ (నైట్) నం. 7382405335లో, 3న జీ అరుణ (డే) నం. 8977478082, నాగేంద్ర (నైట్) నం. 9160521121లో, 3న షేక్ సర్వసత్ (డే) నం. 738693456లో, లక్ష్మణ్ (నైట్) నం.7382964570లో, 4న శైలజ (డే) నం.793517168లో, డీ శ్రీకాంత్ (నైట్) నం.7093517168లో, 4న లీలారాణి (డే) నం. 8096347314లో, పీఎస్‌వీ ప్రసాద్ (నైట్) నం. 9885318206లో, 5న షేక్ సల్మా (డే) నం.9985304591లో, డీ సుధీర్ (నైట్) నం.8801194847లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఆటలకు వేళాయెరా!



ఏసీ స్టేడియంలోని గోదాములో క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా పోటీల కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 768 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడలు నిర్వహించనున్నారు. జిల్లాలో దాదాపు 28 వేలకు పైగా మ్యాచ్‌లు జరగనున్నాయి.

- 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు
- ఈ నెల 15 నుంచి జనవరి 26 వరకు టోర్నీ
- జిల్లాలో 768 సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు
- గుర్తించిన 328 ఆటస్థలాల్లో క్రీడా పోటీలు
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల నిర్వహణ
- పేర్ల నమోదుకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

నెల్లూరు(బారకాసు): జిల్లాలో డిసెంబరు 15 నుంచి జనవరి 26 వరకు ఏకంగా 43 రోజుల పాటు ఐదు దశల్లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జరుగనున్నాయి. డిసెంబరు 15 నుంచి 20 వరకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి, 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయి, జనవరి 5 నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయి, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు అదనంగా యోగా, టెన్నికాయిట్, మారథాన్ ఈవెంట్లు నాన్ కాంపిటేటివ్ విభాగంలో నిర్వహిస్తారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు ఇవ్వనున్నారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ డబుల్స్‌లో నియోజక వర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35 వేలు, 20 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.

గోడౌన్‌లో కిట్‌లు, క్రీడా సామగ్రి సిద్ధం

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలను సచివాలయాలకు పంపించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన సామగ్రి మొత్తం నగరలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న గోదాములో భద్రపరిచారు. వీటిని ఇటీవల జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పరిశీలించారు. క్రీడా మెటీరియల్స్‌ను బుధవారం నుంచి సచివాలయాలకు చేరవేసే ప్రక్రియను ప్రారంభించారు.

328 ఆటస్థలాలు సిద్ధం

జిల్లాలోని 39 మండలాల్లో మొత్తం 768 గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో 'ఆడుదాం ఆంధ్రా' టోర్నీ నిర్వహించనున్నారు. గత నెల 27వ తేదీ నుంచి సచివాలయ పరిధిలో ఆటగాళ్ల పేర్లు, వివరాలను నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 328 ఆటస్థలాలు సిద్ధం చేశారు. మొత్తం 7680 మంది స్పోర్ట్స్ వలంటీర్లు, 420 మంది ఫిజికల్ డైరెక్టర్లు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సచివాలయ ఉద్యోగులు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

క్రీడాభిమానులకు అవకాశం



రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా చేపట్టిన ఈ మెగా క్రీడోత్సవంలో క్రీడాభిమానులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలి. ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టాం. వ్యాయామ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశాం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఒక ఉద్యమంలా ఈ కార్యక్రమం చేపడుతున్నాం. పోటీల్లో పాల్గొనదలచిన వారంతా తప్పనిసరిగా సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంది.

– వికాస్‌మర్మత్, కమిషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ



'ఆడుదాం ఆంధ్రా'లో యువత పాల్గొనాలి

- విలేకరుల సమావేశంలో మంత్రి కాకాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అతిపెద్ద క్రీడా మహోత్సవం 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీల్లో జిల్లాలోని యువత పెద్దఎత్తున పాల్గొనాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఈనెల 15 నుంచి పోటీలు ప్రారంభమై ఫిబ్రవరి మూడో తేదీ బహుమతి ప్రదానోత్సవాలతో ముగుస్తాయన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే పోటీల నిర్వహణకు ఎంపిక చేసిన మైదానాలను అధికారులు సిద్ధం చేశారని, క్రీడా పరికరాలు కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 15 సంవత్సరాలు పైబడిన యువతీ యువకులు క్రీడల్లో పాల్గొనేందుకు స్థానిక సచివాలయాల్లో లేదా ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విజేతలైన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మొమెంటోలు, మెడల్స్, నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు.

సోమిరెడ్డికి మైనింగ్ ఓనర్లతో ఒప్పందం

జిల్లాలో తెల్లరాయి అక్రమ రవాణాపై హడావుడి చేసిన సోమిరెడ్డి మళ్లీ మిన్నకుండి పోయారు. సోమిరెడ్డి చేసేవన్నీ కిరాయి పాలిటిక్స్ అని మంత్రి అన్నారు. మైనింగ్ యజమానులు ఆయన్ను కలిసిన తర్వాత నోరు మెదపడం లేదన్నారు. 14 మందికి వాటా ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. మైనింగ్ యజమానులతో ఒప్పందం కుదరడంతో ఇప్పుడు సిలికాన్‌పై పడ్డారన్నారు. అక్కడా ఒప్పందం కుదిరినట్లుగా ఉంది. అందుకే నోరు మెదపడం లేదన్నారు. తెలంగాణలో ఎగ్జిట్ పోల్స్ గురించి మాట్లాడుతూ అవి అభిప్రాయ సేకరణకు పనికి వస్తుందే తప్ప ఎగ్జిట్ పోల్స్‌కు ఎప్పుడు కొలమానం కాదన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాపై తుపాన్ ప్రభావం చూపుతుందనే హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బందికి సెలవులను రద్దు చేశామని, ఉద్యోగులు వారికి నిర్దేశించిన హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల తన చాంబర్ నుంచి శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. స్తంభాలు పడిపోయినా.. విద్యుత్ వైర్లు తెగినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది లేదా అధికారులకు తెలియజేయాలని కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి బాలచంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్లు కల్పన, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్లోంచి జారిపడి యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): రైల్లోంచి ప్రమాదవశాత్తూ జారిపడటంతో గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఆయ్యప్పగుడి ఫ్లైఓవర్ సమీపంలోని పట్టాలపై శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 20 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు కలిగి.. నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ జర్కిన్, బ్లూ రంగుపై గ్రీన్, నలుపు రంగు చెక్స్‌గల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యంకాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



కావలి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన పట్టణంలోని ముసునూరులో చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ వివరాల మేరకు.. ముసునూరుకు చెందిన బొడ్డు సురేష్ (35), చెంచయ్య నెల్లూరు వైపునకు టీవీఎస్ స్కూటీపై రాంగ్ రూట్‌లో వెళ్లసాగారు. ఈ క్రమంలో లారీని స్కూటీ ఎదురుగా బలంగా ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన సురేష్ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన చెంచయ్యను కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.87
లేయర్	రూ.95
బ్రాయిలర్ చికెన్:	రూ.164
స్కిన్‌లెస్ చికెన్:	రూ.184
లేయర్ చికెన్:	రూ.162

భూములకు సంపూర్ణ హక్కులు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రైతులు అనుభవిస్తున్న భూములకు సంపూర్ణ హక్కులను సీఎం జగన్ మోహన్‌రెడ్డి కల్పించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమీక్షంలో పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను శుక్రవారం స్వీకరించారు. రెవెన్యూ సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకునే రైతులకు శాశ్వత హక్కు కల్పించడం ద్వారా వాటిని వారు విక్రయించుకునేందుకు వీలు ఏర్పడనుందని చెప్పారు. జిల్లాలో 6,500 ఎకరాల అసైన్‌మెంట్ భూములను పంపిణీ చేయగా, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 5,023 ఎకరాలను అందజేశారని వెల్లడించారు. ఈ భూముల విలువ రూ.400 కోట్ల వరకు ఉంటుందని, ఇది తమ ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు. మండలంలో 1,939 కుటుంబాలకు 2,910 ఎకరాల అసైన్‌మెంట్ భూములను పంపిణీ చేశామని తెలిపారు.

సోమిరెడ్డివి చిల్లర రాజకీయాలు

అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. సైదాపురం మండలంలో నిజనిర్ధారణ పేరుతో హంగామా చేసి చిల్లర వసూలు చేసి మిన్నకుండిపోయారని ఆరోపించారు. సిలికాను అక్రమంగా తరలిస్తున్నారంటూ అక్కడా వసూలు చేసి.. ఇప్పుడు మండలంలో అక్రమ మైనింగ్ అంటూ గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. సోమిరెడ్డి అవినీతి చరిత్ర మొత్తం తనకు తెలుసునని, ప్రజాసమస్యలపై ఏనాడైనా పోరాటం చేశారానని ప్రశ్నించారు. సోమిరెడ్డి తలకిందులుగా తపస్సు చేసినా సర్వేపల్లిలో గెలిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తహసీల్దార్ వీరవసంతరావు, డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు శివమోహన్, కసనా నాయక్, ప్రసాద్, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, రావుల దశరథరామయ్యగౌడ్, వళ్లూరు గోపాల్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ పంపిణీ చరిత్రాత్మకం

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



రైతుకు పట్టాను పంపిణీ చేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): స్వాతంత్ర్యానంతరం ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా పేదలకు శాశ్వత భూ పట్టాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేశారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. అసైన్‌మెంట్ భూములకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలను బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 113, కోవూరు మండలంలో 12 మంది రైతులకు వారి భూములపై సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. నియోజకవర్గంలోని 1988 సర్వే నంబర్లలో 2673 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు కానుకగా ఇచ్చారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌ను పొందాలంటే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని.. అయితే ప్రస్తుతం సచివాలయ వ్యవస్థతో వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటే అందించే విధానానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ సుప్రజ, తహసీల్దార్లు పద్మజ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగటి వేషగాళ్లు ఇంతకాలం ఎక్కడికెళ్లారు..?

కరోనా సమయంలో ప్రజల వైపు కన్నెత్తి చూడని టీడీపీ, జనసేన నేతలు మరికొద్ది నెలల్లో ఎన్నికలు రానుండటంతో మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ప్రజలను ఓటడిగే నైతిక హక్కును వారు కోల్పోయారని చెప్పారు. పగటి వేషగాళ్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

బీఎల్‌ఏల ఓటు వెరిఫికేషన్‌కు అభ్యంతరం లేదు



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): టీడీపీ తరఫున ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) ఓటరు వెరిఫికేషన్ చేసుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 15వ డివిజన్లో గల సీపీఎం కార్యాలయ రోడ్డు, తుమ్మలకట్ట సంఘం, చీపురుకట్ట సంఘం తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో తన దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు ఇంకా ఏమైనా ఉన్నాయానని తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. టీడీపీ కార్యకర్తలపై చేయేస్తే సహించేది లేదంటూ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారని. అయితే ప్రజల వద్దకు వెళ్లి ఓటీపీలు అడగాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. నగర నియోజకవర్గంతో సంబంధం లేని వ్యక్తులు వెళ్లి ఓటీపీలు అడిగి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తే పోలీసులకు అప్పగించి కేసులు పెడతామని స్పష్టం చేశారు. విద్యార్థులకు పాఠాలను చెప్పించడాన్ని మానేసి రోడ్లపై తిప్పడం మంచి పద్ధతి కాదని నారాయణకు హితవు పలికారు. కార్పొరేటర్ గణేశం సుజాత తదితరులు పాల్గొన్నారు.

500 మొబైల్స్ రికవరీ

• బాధితులకు అందజేసిన ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



రికవరీ చేసిన ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): మొబైల్ హంట్ సేవలు సత్ఫలితాలిస్తున్నాయని, వివిధ కారణాలతో పోగొట్టుకున్న మొబైల్స్‌ను సాంకేతిక సాయంతో గుర్తించి, రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. తాజాగా సైబర్ క్రైమ్ రికవరీ చేసిన రూ.1.25 కోట్ల విలువైన 500 మొబైళ్లను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో బాధితులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కేవలం 91543 05600 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ పంపడం ద్వారా జిల్లాలో చోరీ అయిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం తక్కువ కాలంలోనే రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు ఐదు విడతల్లో రూ.4.35 కోట్ల విలువజేసే 1726 మొబైళ్లు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సుమారు రూ.ఏడు లక్షల విలువజేసే 35 మొబైళ్లను బాధితులకు అందించామని చెప్పారు. మిగిలిన ఫోన్లను సైతం త్వరలోనే రికవరీ చేస్తామని వెల్లడించారు. ఏఎస్పీ హిమవతి, డీటీసీ డీఎస్పీ శిరీష, ఆర్ఐ అంకమరావు, సైబర్ క్రైమ్ ఎస్సై సురేష్, ఆర్ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం



నెల్లూరు రూరల్: ఇంజిన్లో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బస్సు దగ్ధమైన ఘటన కాకుపల్లి వద్ద నెల్లూరు – ముత్తుకూరు రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. ముత్తుకూరు మండలంలోని నేలటూరులో సెంబ్‌కార్ప్ పవర్ ప్లాంట్‌కు సంబంధించిన ఉద్యోగుల కోసం ఎలక్ట్రిక్ బస్సును అద్దె ప్రాతిపదికన గోవిందయ్య నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విధి నిర్వహణకు వెళ్లిన సుమారు 30 మంది ఉద్యోగులు తమ ప్రాంతాలకు చేరేందుకు ఈ బస్సులో బయల్దేరారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కాకుపల్లికి వచ్చేసరికి బస్సులోని బ్యాటరీ నుంచి పొగలొచ్చాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సులో ఉన్న వారు వెంటనే దిగేయాలని సూచించారు. ఈలోపు పొగలు వ్యాపించడంతో బస్సులోని వారందరూ పెద్దగా కేకలేస్తూ కిటికీ అద్దాలు తదితర మార్గాల ద్వారా బయటపడ్డారు. కిటికీ అద్దాల నుంచి కిందికి దూకిన పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నెల్లూరు అగ్నిమాపక సిబ్బంది, రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది.

వివరాల నమోదుకు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో వివరాలను నమోదు చేసేందుకు గడువును ఈ నెల 31 వరకు పొడిగించారని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల వివరాలను సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్ వచ్చే నెల 15లోపు క్షుణ్ణంగా పరిశీలించి తన లాగిన్ ద్వారా ధ్రువీకరించాలని కోరారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా మిస్‌మ్యాచ్ ప్రొఫార్మాతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: నగరంలోని సర్వజనఆస్పత్రి, ఏసీఎస్సార్ ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు గానూ ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. spsnellore.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో సగటున 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం శుక్రవారం నమోదైంది. ఇందుకూరుపేట మండలంలో 76.2, నెల్లూరు అర్బన్‌లో 66.4, నెల్లూరు రూరల్‌లో 57.8, కోవూరులో 60, పొదలకూరులో 46.8, దగదర్తిలో 46.4, తోటపల్లి గూడూరులో 42.8, అల్లూరులో 39.2, కలువాయిలో 38.6, బోగోలులో 30.2, విడవలూరులో 27.2, సైదాపురంలో 26.2, కొడవలూరులో 25.4, బుచ్చిరెడ్డిపాళెంలో 24.6, మనుబోలులో 21.8, వెంకటాచలంలో 21.2, ఆత్మకూరులో 20.2, కావలిలో 18.6, కొండాపురంలో 18.4, కలిగిరిలో 17.6, ముత్తుకూరులో 14.6, చేజర్లలో 13.2, ఉదయగిరిలో 13.2, అనంతసాగరంలో 12.8, ఏఎస్‌పేటలో 11.8, వింజమూరులో 10.6, సంగంలో 10.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



ర్యాలీని ప్రారంభిస్తున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: సంపూర్ణ అవగాహనతో ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించొచ్చని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి టౌన్‌హాల్ వరకు ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. అనంతరం టౌన్‌హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. పాజిటివ్ ఉన్న వారికి మందులను ఏఆర్టీ కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. హెచ్ఐవీ రహిత నెల్లూరును తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం పీఎంపీ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులకు ప్రశంసపత్రాలను అందజేశారు. ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.